సాక్షి
నంద్యాల
శనివారం । 2 । మార్చి । 2024




ఎస్సార్బీసీకి నీరు విడుదల

పాణ్యం: ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచనల మేరకు ఎస్సార్బీసీ ఆయకట్టు కింద సాగు చేసిన మిరప పంటకు చివరి తడి నీటిని గోరుకల్లు నుంచి శుక్రవారం విడుదల చేశారు.



భక్తులకు ఉచిత బస్సులు

శ్రీశైలంటెంపుల్: బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు పార్కింగ్ ప్రదేశాల నుంచి ఆలయానికి, వసతి గదులకు చేరుకునేలా దేవస్థానం 10 ఉచిత బస్సులను అందుబాటులో ఉంచింది.



నల్లమల మీదుగా..

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులు నల్లమల అటవీ మార్గం గుండా శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల చెంతకు చేరుకుంటున్నారు.

IIలో▸

న్యూస్‌రీల్

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణను నిర్ణీత షెడ్యూల్‌లోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోలింగ్ విధుల నిర్వహణకు సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు గైర్హాజరు కాకుండా రిజర్వు సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ తదితర అన్ని రకాల బృందాలకు అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ సరఫరా లోటుపాట్లు లేకుండా నివేదికలు తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

24 గంటల ప్రయాణానికి అనుమతి



శ్రీశైల మార్గంలో ప్రకాశం జిల్లా దోర్నాల అటవీశాఖ చెక్‌పోస్టు

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రి పర్వదినాలలో శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అటవీ మార్గంలో 24 గంటల ప్రయాణానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు అనుమతులిచ్చాయి. సాధారణ రోజుల్లో రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు ఏ వాహనాన్ని రిజర్వ్‌ఫారెస్ట్ మీదుగా ప్రయాణించేందుకు అటవీ చెక్‌పోస్టుల వద్ద అనుమతి లేదు. శ్రీశైలంలో మహాశివరాత్రి పర్వదిన ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు భక్తుల వాహనాలను రాకపోకలకు అనుమతించారు. ఈ మేరకు ఆంధ్రరాష్ట్ర ఆత్మకూరు అటవీ డిప్యూటీ డైరెక్టర్ అలాన్‌చాంగ్ టెరాన్, తెలంగాణా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఎంసి.పార్గెయిన్ ఉత్తర్వులు జారీ చేశారు.ఆత్మకూరు, విజయవాడ, ఒంగోలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు దోర్నాల చెక్‌పోస్టు మీదుగా, తెలంగాణా ప్రాంతం నుంచి వచ్చే భక్తులు మన్ననూర్, దోమలపెంట చెక్‌పోస్టుల మీదుగా శ్రీశైలంకు చేరుకోవచ్చు.

65 మంది గైర్హాజర్

నంద్యాల(న్యూటౌన్): టెట్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నంద్యాల పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో జరిగిన ఎస్‌ఏ–1, 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8.30 గంటలకు మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్షలు జరిగాయి. ఆర్‌జీఎం, శాంతిరాం, ఎస్‌వీఆర్, రామకృష్ణ కళాశాలల్లో జరిగిన ఈ పరీక్షలకు 577 మంది హాజరు కాగా 65 మంది గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. టెట్ పరీక్షలకు స్క్వాడ్ అధికారులు బ్రహ్మంనాయక్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. టెట్ పరీక్షలు నంద్యాల జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి.

పది విద్యార్థులకు ఆదివారం తరగతులు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో ఈనెల 3వ తేదీన ఆదివారం కూడా జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహించుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలని ఆయన వివరించారు. ఈ విషయాన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తప్పక పాటించాలన్నారు.



చండీశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న చైర్మన్, ఈవో దంపతులు



భేరి మోగించి ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్న ఈవో



మల్లన్నకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న శ్రీకాళహస్తి ఆలయ అధికారులు

దేవతలారా..రారండి!

- ఇలకైలాసంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- చండీశ్వరునికి ప్రత్యేక పూజలు
- శాస్త్రోక్తంగా ధ్వజారోహణ
- నేటి నుంచి స్వామి అమ్మవార్లకు వాహనసేవలు, గ్రామోత్సవాలు



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ధ్వజపటాన్ని ఆవిష్కరించిన దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరిలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలారా రారండంటూ దేవస్థాన అధికారులు, ఆలయ అర్చకులు ఆహ్వానం పలికారు. బ్రహ్మోత్సవాలకు సారథ్యం వహించాల్సిందిగా బ్రహ్మదేవుడిని, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవంలో కన్యాదానం చేసేందుకు మహావిష్ణువును రావాలని ఆహ్వానించారు. పరమశివుడి వాహనమైన నందిని చిత్రీకరించిన ధ్వజపతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీశైలంలో శుక్రవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు వేదపండితులు, అర్చకులు యాగశాల ప్రవేశం చేసి బ్రహ్మోత్సవ క్రతువులకు నాంది పలికారు. బ్రహ్మోత్సవాలు.. సృష్టికర్తఅయిన బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో, క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివపరివార దేవతలలో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో నిర్వహించబడతాయని చెప్పబడుతుంది. అందుకే యాగశాల ప్రవేశ అనంతరం చండీశ్వరునికి ప్రత్యేకంగా పూజాదికాలు జరిపారు. 11 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు స్వామిఅమ్మవార్లకు విశేష వాహనసేవలు ఉంటాయి. ఆలయంలో ఆగమ శాస్త్రానుసారంగా ఉత్సవ ప్రారంభపూజలు నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, అర్చకులు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు. వేదపండితులు చతుర్వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు. అధ్యాపకులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ బ్రహ్మోత్స సంకల్పాన్ని పఠించారు. తరువాత పుణ్యాహవచనం జరిపించారు. చండీశ్వరపూజ జరిపించారు. అనంతరం కంకణాలకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి కార్యనిర్వహణాధికారి కంకణాన్ని ధరించారు. అలాగే రుత్విగ్వరణం, అఖండస్థాపన, వాస్తుపూజ, వాస్తుహోమం, రుద్రకలశస్థాపన, పంచవరణార్చనలు జరిపించారు. అనంతరం బ్రహ్మోత్సవ క్రతువులకు అంకురార్పణ చేశారు. సాయంత్రం 7 గంటలకు ధ్వజారోహణ, భేరి పూజ కార్యక్రమాలను నిర్వహించి సకల దేవతలకు ఆహ్వాన సూచికగా ధ్వజపతాకాన్ని ఆవిష్కరించారు.

నేడు భృంగివాహనసేవ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివారులు భృంగి వాహనసేవలో భక్తులకు దర్శనమిస్తారు. స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు.

శివ స్వాములకు స్పర్శ దర్శనం ప్రారంభం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివమాల ధరించిన శివస్వాములకు శ్రీశైల దేవస్థానం మల్లన్న స్పర్శ దర్శన భాగ్యం కల్పించింది. శుక్రవారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు ప్రతిరోజు విడతల వారీగా జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు మల్లన్న స్పర్శ దర్శనాన్ని కల్పిస్తున్నారు. శివస్వాములకు ప్రత్యేకంగా చంద్రావతి కల్యాణ మండపం నుంచి క్యూలైన్ ఏర్పాటు చేసి దర్శన సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. చంద్రావతి కల్యాణ మండపంలో 4 కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసి శివస్వాములకు అల్పాహారం, తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యాలను కల్పించారు. అలాగే ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి మల్లన్న స్పర్శ దర్శనాన్ని కల్పిస్తున్నారు.



ప్రత్యేక క్యూలైన్‌లో స్పర్శ దర్శనానికి వెళ్తున్న శివస్వాములు

మల్లన్నకు శ్రీకాళహస్తీశ్వర స్వామి పట్టు వస్త్రాలు

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం వారిచే భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. శుక్రవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈఓ ఎంవీ నాగేశ్వరరావు దంపతులు పట్టువస్త్రాలతో రాజగోపురం వద్దకు రాగా దేవస్థానం ఈఓ పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులు పట్టువస్త్రాలు తలపై పెట్టుకొని స్వామి అమ్మవార్లకు సమర్పించారు. ఆశీర్వచన మండపంలో శ్రీకాళహస్తి దేవస్థాన ఈఓ దంపతులకు స్వామి వారి శేష వస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమములో శ్రీకాళహస్తి ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుక్కుల్ పాల్గొన్నారు.

ఏటా రెండు బ్రహ్మోత్సవాలు

శ్రీశైల క్షేత్రం సంప్రదాయాన్ని అనుసరించి ఏటా శ్రీశైల మల్లన్నకు రెండుసార్లు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తాం. సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఏడు రోజుల పాటు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 11 రోజుల పాటు నిర్వహిస్తాం. బ్రహ్మోత్సవ క్రతువులన్ని సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహిస్తాం.

– వీరయ్యస్వామి, మల్లికార్జునస్వామి ఆలయ ప్రధానార్చకులు

భక్తులకు సకల సౌకర్యాలు

భక్తులకు ఎలాంటి లోటు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. బ్రహ్మోత్సవాలకు అధికసంఖ్యలో భక్తులు శ్రీశైలానికి తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకొని తరలించాలి. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

సామాన్య భక్తులకు పెద్దపీట

శ్రీశైల బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి లోటులేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించాం. సామాన్య భక్తులను దృష్టిలో ఉంచుకుని వారికే పెద్దపీట వేస్తున్నాం. ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం.

– రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్

ఉన్నత చదువులకు ఆర్థిక భరోసా



జగనన్న విద్యాదీవెన చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

- విద్యాదీవెన నిధులు విడుదల చేసిన సీఎం జగన్
- జిల్లాలో 33,481 మంది విద్యార్థులకు లబ్ధి
- విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.24.44 కోట్లు జమ
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన పథకంతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం నిధులను సీఎం జగన్ శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రులో నిర్వహించిన బహిరంగ సభ నుంచి బటన్ నొక్కి నేరుగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కార్పొరేషన్ డైరెక్టర్లు శశికళారెడ్డి, సునిత అమృతరాజ్, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి విద్యార్థులు, తల్లిదండ్రులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్న ప్రజలకు మంచి చేసేందుకు ఆలోచించలేదని, కేవలం తన అవినీతి కోసమే అధికారాన్ని అడ్డుపెట్టుకున్నారని విమర్శించారు. కనీసం చెప్పుకోవడానికి ఓ మంచి పథకం కూడా అమలు చేయలేకపోయారన్నారు. సాంఘిక సంక్షేమ అధికారిణి చింతామణి మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 33,481 మంది విద్యార్థులకు సంబంధించి 30,136 మంది తల్లుల ఖాతాల్లో రూ.24.44 కోట్లు జమ చేశామన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 5,238 మంది విద్యార్థుల తల్లులకు రూ.4.13 కోట్లు, బనగానపల్లెలో 5,435 మంది విద్యార్థుల తల్లులకు రూ.4.45 కోట్లు, డోన్‌లో 4440 మంది విద్యార్థుల తల్లులకు రూ.3.43 కోట్లు, నందికొట్కూరులో 4,452 మంది విద్యార్థుల తల్లులకు రూ.3.44 కోట్లు, నంద్యాలలో 5,165 మందికి రూ.4.73 కోట్లు, పాణ్యంలో 1,515 మందికి రూ.1.24 కోట్లు, శ్రీశైలంలో 3,891 మందికి రూ.2.99 కోట్లు, వెరసి మొత్తం 33,481 మంది విద్యార్థులకు సంబంధించి 30,136 మంది తల్లుల ఖాతాల్లో రూ.24.44 కోట్లు జమ చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జెడ్పీ చైర్మన్, ఏపీఎస్పీడీసీఎల్ డైరక్టర్, దృశ్య కళా డైరక్టర్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థుల తల్లులకు జగనన్న విద్యా దీవెన చెక్కును అందజేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 501 మంది విద్యార్థులు గైర్హాజరు



నంద్యాల నేషనల్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాల్లో 12,909 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు) పేపర్–1 రాయాల్సి ఉండగా 12,408 మంది విద్యార్థులు హాజరయ్యారు. 501 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవీఈఓ సునీత తెలిపారు. నంద్యాలలో పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, నేషనల్, న్యూక్లియస్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. పరీక్షల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎండా కాలంలో పరీక్షలు రాసే విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. డీవీఈఓతో పాటు మూడు టీంలు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలో పాల్గొన్నాయి.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు



రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఐజీ విజయరావు



ఫోర్‌లైన్స్ పనులు జరుగుతున్న దృశ్యం

నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 4వ తేదీన బనగానపల్లె పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీఎం పర్యటన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈబీసీ నేస్తం నిధుల విడుదల, వంద పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సీఎం వస్తుండటంతో పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం అధికారులకు అప్పగించిన పనులు బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. హెలిపాడ్ ప్రాంతంలో పనులు వేగంగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ, అగ్నిమాపక అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు అవసరమైన జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. హెలిపాడ్ సమీపంలో ఏర్పాటు చేసే సేఫ్ రూముల్లో అత్యవసర మందులతో పాటు నిపుణులైన డాక్టర్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభా వేదిక ప్రాంతంలో మంచినీటి వసతి, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆర్‌టీఓ శివారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, ఆర్‌డీఓలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వరరెడ్డి, మిరియాల దాసు పాల్గొన్నారు.

డీఐజీ పరిశీలన

బనగానపల్లె: ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను డీఐజీ సీహెచ్ విజయరావు శుక్రవారం రాత్రి పరిశీలించారు. ముందుగా పట్టణంలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ స్థలం, అక్కడి నుంచి సభ నిర్వహించే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానాన్ని పరిశీలించారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే సీఎం పర్యటన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. డీఐజీ వెంట ఎస్పీ రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీలు ప్రవీణ్‌కుమార్, చంద్రబాబు, డీఎస్పీలు సంతోష్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

శరవేగంగా పనులు

సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు శరవేగంగా చేపడుతున్నారు. బనగానపల్లె పట్టణంలో ప్రధాన కూడళ్లు, రహదారులను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. నూతనంగా రూ.22 కోట్లతో నిర్మించిన వంద పడకల ఏరియా ప్రభుత్వ వైద్యశాలను సీఎంఓ అధికారుల బృందం పరిశీలించింది.



తాతకు పొద్దునే పింఛన్.. మహానంది మండలం తిమ్మాపురంలో షేక్ మాబుసాకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ యాసిన్



కొలిమిగుండ్ల మండలం చింతలాయిపల్లెకు చెందిన దివ్యాంగురాలు రమాదేవికి ఆసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీరు భారతి



ఠంచన్‌గా.. కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామంలో లబ్ధిదారుడు గుడు సాహెబ్‌కు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ జాకీర్



అవ్వా అందుకో పింఛన్.. బేతంచెర్ల పట్టణం 1వ సచివాలయం పరిధిలో గరికపాటి రోశమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు భువనేశ్వరి

ఆనందమని‘పింఛన్’!

- జిల్లాలో మొదటి రోజు 51.48 శాతం పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): తెల్లవారక ముందే తలుపు తట్టి పింఛన్ డబ్బులు అందజేయడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 1వ తేదీనే ఠంఛన్‌గా పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేలును మరువలేమని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలో 2,23,601 మంది పింఛన్ దారులకు మార్చి నెలకు సంబంధించి రూ.66.44 కోట్లు నగదును ప్రభుత్వం మంజూరు చేయగా మొదటి రోజు 51.48 శాతం పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రతి నెల 1వ తేదీ ఉదయం నుంచే పింఛన్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

తల్లీబిడ్డా సురక్షితం

ఇదీ మార్పు



బిడ్డను తల్లిఒడికి చేర్చుతున్న డాక్టర్ నాగేంద్ర, స్టాఫ్‌నర్సు సాయికృప

గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీసం మందు బిళ్లలు కూడా అందుబాటులో ఉండేవి కాదు. వైద్యుల నియామకం లేక, అరకొర వైద్య సిబ్బందితో సరైన వైద్య సేవలు అందక రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి జేబులను గుల్ల చేసుకోవాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్యానికి పెద్దపీట వేయడంతో కార్పొరేట్ వైద్య సేవలు పేదలకు అందుతున్నాయి. పీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని నియమించడం, స్థాయిని పెంచి సౌకర్యాలు కల్పించడంతో ఊహించని విధంగా పేదలు సేవలు పొందుతున్నారు. ఇందుకు దొర్నిపాడు ఆసుపత్రినే నిదర్శనం. శుక్రవారం దొర్నిపాడుకు చెందిన దివ్యశ్రీ మొదటి కాన్పును స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నాగేంద్ర ఆధ్వర్యంలో చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారన్నారు. దీంతో వైద్యశాలలో కాన్పుకావడంతో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.5వేల నగదును తల్లి వ్యక్తిగత ఖాతాలో జమచేసినట్లు చెప్పారు. గత నెలలో వైద్యశాలలో ఐదు కాన్పులు జరిగాయని పేర్కొన్నారు. ఇంటి వద్ద కాన్పులు ప్రమాదకరమని, ప్రభుత్వం అన్ని వైద్యశాలల్లో మెరుగైన వసతులు కల్పించిందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

– దొర్నిపాడు

క్లుప్తంగా

రెండు సొసైటీల రిజిస్ట్రేషన్లు రద్దు

నంద్యాల (సెంట్రల్): సహకార శాఖ పరిధిలోని రెండు సొసైటీల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా సహకార శాఖ అధికారి వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోస్పాడు మండలం సాంబవరం గ్రామానికి చెందిన శ్రీ రాజరాజేశ్వరి లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ, కోవెలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన కలుగొట్ల స్టోన్ కట్టర్స్ ఎల్‌సీసీయెస్ లిమిటెడ్ సహకార సంఘాల రిజిస్ట్రేషన్లు రద్దు చేశామన్నారు. ఈ రెండు సంఘాలకు ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల డివిజనల్ సహకార అధికారులను లిక్విడేటర్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సంఘాల పనితీరు బాగా లేకపోవడంతో గతంలోనే డిపాజిటర్లు, రుణదాతలకు సంబంధించి ఏవైనా పరిష్కారాలు ఉంటే తెలపాలని నోటీసులు జారీ చేశామన్నారు. కానీ ఇప్పటివరకు ఆయా సొసైటీల నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో పరిష్కార ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు.

శ్రీశైలం నుంచి నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి 1,839 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 960 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 878 క్యూసెక్కుల నీటిని వదిలారు. శుక్రవారం సాయంత్రానికి జలాశయంలో 37.4550 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యాం నీటిమట్టం 815.10 అడుగులకు చేరుకుంది.

దాడి చేసిన చిరుతపులి ఇదే



సీసీ కెమెరాల్లో కనిపించిన చిరుతపులి

మహానంది: మహానంది సమీపంలోని నల్లమల అడవిలో ఫిబ్రవరి 25వ తేదీన అటవీశాఖ ప్రొటెక్షన్ వాచర్ అజీమ్‌బాషపై చిరుతపులి దాడి చేసిన విషయం తెలిసిందే. నల్లమలలోని లెపర్డ్ బేస్ క్యాంపు వద్ద విధుల్లో ఉండగా చిరుతపులి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు అజీమ్‌బాష గురువారం వరకు నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఇంటికి చేరాడు. ఇదిలా ఉండగా లెపర్డ్ బేస్ క్యాంపు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చిరుతపులిని అటవీశాఖ అధికారులు గుర్తించారు. బేస్ క్యాంప్ చుట్టూ తిరిగినట్లు కెమెరాలో రికార్డు అయ్యింది.

ఘాట్‌రోడ్డులో ప్రమాదం



ఆత్మకూరు: ఆత్మకూరు-దోర్నాల రహదారిలో నల్లమల ఘాట్‌లోని రోళ్ల పెంట మలుపు వద్ద శుక్రవారం శ్రీశైలం నుంచి ఆత్మకూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు, కర్నూలు నుంచి విజయవాడకు వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో కొందరు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును మలుపు వద్ద తప్పించడంతో చిన్న ప్రమాదంతో బయటపడ్డారు. ఈ ప్రమాదంతో 2 గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం ఆత్మకూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి లారీని తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సోషల్ ఆడిట్‌కు ఈ-క్రాప్ బుకింగ్ జాబితాలు

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ జాబితాలను సోషల్ ఆడిట్‌కు పెట్టారు. శుక్రవారం పంటల నమోదు జాబితాలను ఆర్‌బీకేల్లో రైతుల పరిశీలనకు ఉంచారు. ఈ నెల 5 వరకు ఆర్‌బీకేల్లో సామాజిక తనిఖీల కోసం జాబితాలు పెట్టామని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు.

నల్లమల మీదుగా మల్లన్న చెంతకు!



నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్రగా వస్తున్న భక్తులు





కైలాసద్వారం వద్దకు పాదయాత్రగా చేరుకుంటున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఓం హరోం హరా, శంభో శంకరా, ఓం నమఃశివాయ అంటూ భక్తుల శివనామ స్మరణతో నల్లమల గిరులు మారుమోగుతున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మల్లన్న చెంతకు పాదయాత్రగా భక్తులు అటవీ మార్గంలో చేరుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు శుక్రవారం పలువురు శివస్వాములు, సాధారణ భక్తులు నల్లమలలో పాదయాత్ర చేసుకుంటూ శ్రీగిరి చేరుకున్నారు. ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర అక్కడి నుంచి గోసాయి కట్ట వీరాంజనేయస్వామి గుడి, నాగలూటి వీరభద్రస్వామి దేవాలయం, దామెర్లకుంట, పెద్దచెరువు, మఠం బావి, భీమునికొలను, కైలాసద్వారం అక్కడి నుంచి హఠకేశ్వరం, సాక్షి గణపతి మీదుగా శ్రీశైలం చేరుకుంటారు. మొత్తం నల్లమల అటవీప్రాంతంలో నడవాల్సి ఉంటుంది. కొండలు, గుట్టలు, వాగులు, వంకలలో నడుచుకుంటూ శ్రీగిరి చేరుకుంటారు. వృద్ధులు, మహిళలు సైతం అటవీప్రాంతంలో మొత్తం 40కిలోమీటర్లు పాదయాత్రగా శ్రీగిరికి చేరుకుంటున్నారు.

దేవస్థానం ఏర్పాట్లు

పాదయాత్రగా తరివచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. కైలాసద్వారం నుంచి భీమునికొలను మెట్ల మార్గం వరకు పైప్ లైన్ ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తుంది. అలాగే పెద్దచెరువు, నాగలూటి, మఠం బావి ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కైలాస ద్వారం వద్ద భక్తులు సేదతీరేందుకు భారీ షెడ్లు ఏర్పాటు చేశారు. తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. అలాగే దేవస్థానం అన్నప్రసాద భవనం నుంచి పాదయాత్ర భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు.కైలాస ద్వారం వద్ద జనరేటర్ సహాయంతో విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు.



కైలాసద్వారం వద్ద ఏర్పాటు చేసి షెడ్డులో సేదతీరుతున్న భక్తులు

చీటింగ్ కేసులో కోట్ల ప్రధాన అనుచరుడు

- 20 రోజులుగా పరారీ



గుమ్మకొండ సర్పంచ్ దశరథరామి రెడ్డి

డోన్: తెలుగుదేశం పార్టీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ప్రధాన అనుచరుడైన గుమ్మకొండ గ్రామ సర్పంచ్ బొమ్మిరెడ్డి దశరథ రామిరెడ్డిపై రూరల్ పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఫిబ్రవరి 8వ తేదీన కేసు నమోదు కాగా పోలీసుల అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ఆరోజు నుంచి పరారీలో ఉన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దశరథరామిరెడ్డి తన వద్ద ఉన్న రెండు హిటాచీ మిషన్లను తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా చింతలపాలెం మండలం వలటూరు గ్రామానికి చెందిన పరిమి నరసింహారావుకు రూ.11 లక్షలకు విక్రయించేటట్లు ఒప్పందం చేసుకుని రూ.5 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. అయితే మూడు నెలలుగా హిటాచీలు అప్పగించకుండా, తీసుకున్న అడ్వాన్స్ తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఫిబ్రవరి 8వ తేదీన మండలంలోని చనుగొండ్ల గ్రామం వద్ద గల గ్రానైట్ గనిలో నరసింహారావు ఉండగా దశరథరామిరెడ్డి, బషీర్‌బాషా కలసి నానా దుర్భాషలాడుతూ దాడికి ప్రయత్నించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై 420, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కాగా అప్పటి నుంచి నిందితుడు పరారీలో ఉన్నాడు.

డోన్‌లో టీడీపీ ఫ్లాప్ షో!



కృష్ణగిరి మండలం చుంచుఎర్రగుడి నుంచి డోన్‌కు వెళ్తున్న టీడీపీ కార్యకర్తలు

డోన్: టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి డోన్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీకి స్పందన కరువైంది. నియోజకవర్గంలో కార్యకర్తలు రాకపోవడంతో పత్తికొండ, తుగ్గలి, దేవనకొండ, ఆలూరు, ఆస్పరి, కోడుమూరు, కృష్ణగిరి, గూడూరు, వెల్దుర్తి, కర్నూలు, కల్లూరు తదితర మండలాల నుంచి జనాలను తరలించారు. పట్టణంలో ప్రదర్శన అనంతరం మధు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో విభేదాలు బట్టబయలు అయ్యాయి. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పాణ్యం నియోజకవర్గ అభ్యర్థి గౌరు చరిత తప్ప ఏ ఒక్క ఎమ్మెల్యే అభ్యర్థి డోన్ సభకు హాజరు కాలేదు. పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ సహా ఆ జిల్లా నాయకులు ఎవరూ సభలో కనిపించలేదు.

బీఐఎస్ హాల్‌మార్క్ వస్తువులనే కొనుగోలు చేయాలి

- సర్పంచుల వర్క్‌షాప్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి

కర్నూలు(న్యూటౌన్): బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హాల్ మార్క్ ఉండే వస్తువులను మాత్రమే గ్రామ పంచాయతీల్లో కొనుగోలు చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి అన్నారు. శుక్రవారం జెడ్పీలోని డీపీఆర్‌సీ భవనంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ బీఐఎస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసే సిమెంట్, స్టీల్, వ్యవసాయ పనిముట్లు, స్టేషనరీ, ఎలక్ట్రికల్ కేబుల్స్, పీవీసీ పైప్స్, మాస్కులు, గ్యాస్ స్టవ్, ప్రెజర్ కుక్కర్ తదితర వస్తువులకు తప్పనిసరిగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హాల్ మార్క్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వస్తువుల కొనుగోలు, వ్యాలిడిటీ తదితర ముఖ్యమైన అంశాలను బీఐఎస్ కేర్ యాప్ ద్వారా అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఐఎస్ రిసోర్స్ పర్సన్ (విజయవాడ) సాయి కౌశిక్, డిస్ట్రిక్ట్ లింక్ ఆఫీసర్ వెంకటరత్నం, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, రాజవర్ధన్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధం

కర్నూలు(సెంట్రల్): సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని సీఈఓ ముఖేష్‌కుమార్ మీనాకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన వివరించారు. శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఇతర అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సీఈఓ ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ వివరించారు. ఎన్నికల నిర్వహణకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వైభవోపేతం..స్వాతి మహోత్సవం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలంలో స్వాతి నక్షత్ర వేడుకలు శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. వేకువజామున శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అమ్మవార్లకు సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి అర్చన, అభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పండితుల మంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాలతో సుదర్శన హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు. వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొన్నారు.

లీజు ఒక చోట.. తవ్వకాలు మరో చోట



బాసరదొడ్డి వద్ద గ్రానైట్ క్వారీని తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): పెద్దకడబూరు మండలం బాసరదొడ్డి గ్రామంలో సర్వే నంబర్ 430లో లీజు తీసుకుని.. మరోచోట గ్రానైట్‌ను తవ్వుతున్నట్లు తమ పరిశీలనలో తేలిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లీజు లేని ప్రాంతంలో ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పెద్దకడబూరు పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న వ్యక్తులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలిసస్పెన్షన్

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని కొండపేట జెడ్పీ బాలు ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్ జానకిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. ఇంటి నిర్మాణ పనులకు విద్యార్థులను ఉపయోగించినట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. త్రీమెన్ కమిటీ పరిశీలన అనంతరం తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సస్పెండ్ కొనసాగుతుందని, అంతవరకు పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడు నాగరాజుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తారన్నారు.

టీజీ భరత్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయండి

- మా స్థలాన్ని మాకు ఇప్పించండి
- నిరసన దీక్షలో బాదరయ్య కుటుంబ సభ్యులు



నిరసన దీక్షలో బాదరయ్య కుటుంబ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ భరత్ అక్రమంగా చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తమ స్థలాన్ని తమకు ఇప్పించాలని కోరుతూ మామిదాలపాడుకు చెందిన బాదరయ్య కుటుంబం నిరసన దీక్షకు దిగింది. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో బాదరయ్య కుమారులు సత్యం, రాజులతోపాటు ఆయన మనువళ్లు నిరసన దీక్షకు దిగారు. ఈ సందర్భంగా బాదరయ్య కుమారులు మాట్లాడుతూ..1982లో తమ తండ్రి అయిన బాదరయ్యకు మామిదాలపాడులోని సర్వే నంబర్ 231/1సీలో 33 సెంట్ల భూమిని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ భూమిని 1984లో తమ తండ్రి అమ్మడానికి రామ్మోహన్‌రావు అనే వ్యక్తికి జీపీఏ ఇచ్చారన్నారు. అయితే 1986లో తమ తండ్రి మరణించడంతో జీపీఏ రద్దు అవుతుందన్నారు. ఈ క్రమంలో 1994లో టీజీ భరత్ జీపీఏ తీసుకున్న రామ్మోహన్‌రావు తండ్రి సుబ్బారావుతో స్థలాన్ని కొనుగోలు చేశారన్నారు. అయితే టీజీ భరత్ తమ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తమకు 2020లో తెలిసిందన్నారు. కాగా, 1982 నుంచి ఇప్పటి వరకు ఆ స్థలం తమ ఆధీనంలో ఉందని, ఇటీవల టీజీ వర్గీయులు దానిని ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా టీజీ భరత్ కొనుగోలు చేసిన 33 సెంట్ల భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తమకు అప్పగించాలని, లేకపోతే తమ కుటుంబం ఆత్మహత్యచేసుకోవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. కాగా, అనుమతి తీసుకొని నిరసన దీక్షలకు దిగిన బాదరయ్య కుటుంబ సభ్యులను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి పంపించారు.

టీజీ భరత్ అనుచరుల హల్‌చల్

టీజీ భరత్ నుంచి తమ స్థలాన్ని తమకు ఇప్పించాలని బాదరయ్య కుటుంబ సభ్యులు నిరసన దీక్షకు దిగిన విషయాన్ని తెలుసుకున్న టీజీ అనుచరులు కొందరు ధర్నా చౌక్‌లో హల్‌చల్ సృష్టించింది. బాధితులు ధర్నా కోసం టెంట్ వేయగా వారు కూడా టెంట్ వేసుకొని తమ నాయకుడిని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ప్రతిగా నిరసనకు దిగారు. ఈ క్రమంలో సాయంత్రం ధర్నా చౌక్‌లో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు బలవంతంగా రెండు శిబిరాలను మూయించారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు మండలాల్లో ఉన్న మోడల్ సూల్స్‌లో పరీక్ష జరుగుతుందని తెలిపారు. 5వ తరగతి స్థాయిలో సిలబస్‌తో పాటు తెలుగు/ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ఉచితంగా చదువుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.